
ప్రజాశక్తి
శనివారం 13 సెప్టెంబర్ 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





పొగాకు నారుమళ్ల పెంపకంలో జాగ్రత్తలు

ప్రజాశక్తి-కందుకూరు: పొగాకు నారుమడులు పెంచే యజమానులు తగిన జాగ్రత్తలు పాటించాలని కందుకూరు ఒకటి, రెండవ వేలం నిర్వహణాధికారులు బి చంద్ర శేఖర్,ఎం కిరణ్‌లు తెలిపారు. శుక్రవారం వారు ఎస్‌జిఒ రాజ్ గోపాల్ తో కలిసి అయ్యవారిపల్లి, రావులకొల్లు గ్రామంలో ఏర్పాటు చేసిన నారుమళ్లను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ నీటి వసరులున్న నేలల్లో మాత్రమే పెంపకం చేపట్టాలన్నారు. నారుమళ్లకు మధ్యలో సుమారు 30 సెంటీ మీటర్ల వెడల్పు ఉండాలన్నారు. 10 మీటర్ల వెడల్పుగల నారుమడిలో ముందుగా 50 గ్రాముల అమ్మోనియం సల్ఫేట్, 50గ్రాముల పొటాషియం సల్ఫేట్, 100గ్రాముల డోలమైట్ వేయాలని సూచించారు. ముందుగా నత్రజని వేయకూడదన్నారు. నారు మొలకెత్తిన వారంరోజుల నుంచి పదిరోజుల వ్యవధిలో రెండసార్లు 50గ్రాముల అమ్మోనియం సల్ఫేట్, 25గ్రాముల పొటాషియం సల్ఫేట్ వేయాలని సూచించారు. పెరుగుదలను బట్టి ఎరువులు వాడాలన్నారు. కార్యక్రమంలో క్షేత్రసహాయకులు జె పృథ్వీరాజ్,షేక్ సూర్య ప్రకాష్,షేక్ చిన ఖాసీబ పాల్గొన్నారు.



అలుపెరుగని పోరాట యోధుడు 'సీతారాం ఏచూరి'



సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్



నెల్లూరు రూరల్ సౌత్‌మోపూరులో నివాళులర్పిస్తున్న నాయకులు



నరుకూరు సెంటర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

అలుపెరుగని పోరాట యోధుడు సిపిఎం అఖిల భారత కార్యదర్శి సీతారాం ఏచూరి అని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. శుక్రవారం 16వ డివిజన్ సిపిఎం శాఖ ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ పార్కు సమీపంలోని సిపిఎం కార్యాలయం లో ఆ పార్టీ నగర కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు కాయంబు శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ హాజరయ్యారు. తొలుత సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం సీతారం ఏచూరి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎటువంటి పోరాటాలు చేశారో ఆమార్గంలోనే పయనిస్తూ స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి తాము కృషి చేస్తామంటూ వర్ధంతి కార్యక్ర మానికి హాజరైన సిపిఎం నాయ కులు, కార్య కర్తలు, ప్రజా సంఘాల సభ్యులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్థానిక సిపిఎం నాయకులు జె.సుధాకర్, కె. సంపూర్ణమ్మ, వెంకటేశ్వర్లు, బాబు, కుమార్, డివైఎఫ్ఐ నగర కమిటీ సభ్యులు వెంకటేష్, రాజేష్,శశి, ఎలిసి పాల్గొన్నారు.

ప్రజాశక్తి ఆధ్వర్యంలో


తొలుత సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజాశక్తి మేనేజర్ కె.కోటేశ్వరరావు, డెస్క్ ఇన్‌ఛార్జి యు.వి.రమణయ్య, స్టాఫర్ పి.బాలకృష్ణ, సబ్ ఎడిటర్స్ ఆర్.మాధవయ్య, పి.వెంకటేశ్వర్లు, సిబ్బంది కరుణానిధి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్‌లో

రూరల్ మండలంలోని సౌత్‌మోపూరులోని సిపిఎం కార్యాలయంలో సీతా రాం ఏచూరికి నివాళులర్పించారు. తొలుత సీతారాం ఏచూరి చిత్ర పటానికి సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్, పొట్టే పాళెం చంద్రమౌళిలు పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్ర మంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాలు, నెల్లూరు రూరల్ సిపిఎం మండల కార్యదర్శి పూడిపర్తి జనార్ధన్, చెంచయ్య, లక్ష్మీ ప్రసాద్, శ్రీపతి వెంకయ్య, గుంటి నాగరాజు, గడ్డం వెంకటేశ్వర్లు, ముత్యాల నాగయ్య, శ్రీపతి దయాకర్, పాదర్తి నారాయణ, సుబ్రమణ్యం, పాదర్తి మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలోని నరుకూరులో కామ్రేడ్ సీతారాం ఏచూరి మొదటి వర్ధంతి శుక్రవారం అత్యంత ఘనంగా జరిగింది. నరుకూరు సెంటర్ ఆటో యూ నియ న్ కార్యదర్శి గోపి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్ర మంలో మండల సిఐటియు కార్యదర్శి మారుబోయిన రాజా మాట్లాడారు. కార్యక్రమంలో రోడ్డు మార్జిన్ వ్యాపారస్తులు పాకం పోలమ్మ, తులసమ్మ, పాపమ్మ, ఆటో వర్కర్స్ శీను, బాషా, బాబు పాల్గొన్నారు.



ప్రజాశక్తి కార్యాలయంలో

సోమిరెడ్డికి కాకాణి సవాల్

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్: సర్వేపల్లి నియోజకవర్గంలో జరుగుతోన్న అవినీతి, అక్రమాలపై సర్వేపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సిబిఐ విచారణకు సిద్ధమేనా అని వైసిపి జిల్లా అధ్యక్షులు మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం డైకస్ రోడ్ లోని కాకాణి గోవర్ధన్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలంలో నాగులబట్ల వారి కండ్రిగలో జరుగుతున్న ట్రావెల్ తవ్వకాలకు ఎంత మేరా అనుమతులు ఉన్నాయో ఎంత గ్రావెల్ తవ్వకాలు జరిగాయో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆధారాలతో సహ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చూపించాలని కాకాణి డిమాండ్ చేశారు. తనపై సోమిరెడ్డి పెట్టిన కేసులకు చేసిన ఆరోపణలకు సిబిఐ విచారణకు సిద్ధంగా ఉన్నానన్నారు.కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు డికెఆర్ సుధాకర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ మాధురి

2029 నాటికి సంపూర్ణ అక్షరాస్యత

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తించి, వారందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి, 2029 నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు కృషి చేయాలని కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ మాధురి సూచించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణలో ఉల్లాస్ అక్షర ఆంధ్ర (న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం) కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో స్వయం సహాయక బృందాలకు శిక్షణ తరగతులను శుక్రవారం నిర్వహించారు.శిక్షణలో భాగంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్యక్రమం అమలు కోసం 8 అభ్యాసాలపై ట్రైనర్లు నారాయణ రెడ్డి , శ్రీకాంత్ లు అవగాహన కల్పించారు. సమావేశంలో అడల్ట్ ఎడ్యుకేషన్ నోడల్ ఆఫీసర్ మస్తాన్ రెడ్డి, అర్బన్ ఎం.ఈ.ఓ. తిరుపాలు, మెప్మా ఏ.ఓ సుధాకర్, సూపర్వైజర్ లు రాజశేఖర్, కృష్ణ కిషోర్, మెప్మా ఆర్.పి లు పాల్గొన్నారు.

పోరాటయోధుడు నారయ్య



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ప్రజాశక్తి- కోవూరు

పడుగుపాడు రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపకులు, కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాడిన ప్రజా పోరాట యోధుడు కామ్రేడ్ పరుచూరి నారయ్య 5వ వర్థంతి సందర్భంగా ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంలో ఆయన పేరుపై ఏర్పాటు చేసిన హమాలీ వర్కర్స్ యూనియన్ ఆఫీస్‌ను సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం సుందరయ్య కళ్యాణ మండపంలో వర్ధంతి సభ జరిగింది. ఈ సభకు సిఐటియు నెల్లూరు నగర కార్యదర్శి జి. నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు.సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ "కామ్రేడ్ నారయ్య కేవలం కార్మిక నేతగానే కాకుండా, సామాజిక సేవకుడిగానూ నిలిచారన్నారు. సుందరయ్య పేరుపై ఈ కళ్యాణ మండపం నిర్మించడంలో ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. మేస్త్రీ మామూళ్లతో పాటు కార్మికుల చెమట చిందించి ఈ మండపాన్ని ప్రజల కోసం నిర్మించారన్నారు. రైల్వే గూడ్స్ షెడ్ ఏర్పాటులో ఎన్నో ఆటంకాలు ఎదురైనా, వాటిని అధిగమించి రాష్ట్రంలోనే పేరుగాంచిన యూనియన్‌ను నిర్మించగలిగారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. మోహన్‌రావు మాట్లాడుతూ "కూలి రేట్ల విషయంలో నారన్న ఎప్పుడూ రాజీ పడేవారు కాదన్నారు. యజమానుల ఒత్తిళ్లను లెక్కచేయకుండా కార్మికుల కోసం పోరాటం చేశారు. యజమానులకు ఇబ్బంది కలగకుండా పనిని పూర్తిచేయడంలో ఎల్లప్పుడూ శ్రద్ధ వహించేవారన్నారు. అందుకే ఆయన కార్మికులకు, యజమానులకు కూడా ప్రియుడిగా నిలిచారు" అని గుర్తు చేశారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోగుల శ్రీనివాసులు, తుళ్లూరు గోపాల్, ఎం. పుల్లయ్య, షేక్ రెహనాబేగం, సిఐటియు జిల్లా అధ్యక్షులు టివివి ప్రసాద్, సిఐటియు నగర అధ్యక్షులు అత్తిమూరు శ్రీనివాసులు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, రైల్వే గూడ్స్ షెడ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.కార్మిక లోకంలో విశేష కీర్తి గడించిన కామ్రేడ్ పరుచూరి నారయ్యను స్మరించుకుంటూ ఆయన ఆవేశం, ఆలోచనలు, పోరాటస్ఫూర్తి తరతరాలకు ఆదర్శంగా నిలుస్తుందని పలువురు నేతలు పేర్కొన్నారు.



ప్రారంభిస్తున్న సిఐటియు మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్‌రావు

కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-నెల్లూరు

రోడ్డు మార్జిన్ వ్యాపారస్తుల సంక్షేమ సంఘం నెల్లూరు జిల్లా ప్రథమ మహాసభ డాక్టర్ రామచంద్ర రెడ్డి భవన్ బాలాజీ నగర్‌లో 14వ తేదీ 9వ నెల 2025 ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది. ఏసీ మార్కెట్ రోడ్డు మార్జిన్లో ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు అమ్మేవారిని కలిసి మహాసభకు ఆహ్వానించడం జరిగింది. ప్రతి ఒక్కరూ పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సిఐటియు రూరల్ అధ్యక్షులు ఎం సుధాకర్, ఏసీ మార్కెట్ చిరు వ్యాపారస్తుల కార్యదర్శి సురేష్, లవన్ కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స ప్రాముఖ్యతపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు+ప్రథమ చికిత్సల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జనరల్, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ మాదాల వెంకట తరుణ్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా యువజన సంక్షేమ శాఖ (సెట్నేల్), కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా), నెహ్రూ యువ కేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో అవగహాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం బుజబుజనెల్లూరు లోని డి.వి.ఎన్.ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించి ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ మాదాల వెంకట్ తరుణ్ పాల్గొని మాట్లాడుతూ ప్రథమ చికిత్స ఆవశ్యకతపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలన్నారు. సెట్నెల్ సీఈఓ ఏ. నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రమాదాలు కారణంగా వేల సంఖ్యలో ప్రాణాలు విడుస్తున్నారని, ప్రథమ చికిత్స అనేది ఓ నైపుణ్యత మాత్రమేనని అన్నారు. ఇది చేసేందుకు వైద్యులే కానవసరం లేదన్నారు. ఏ ప్రమాదానికి ఎలా స్పందించాలో తెలిస్తే ప్రతి ఒక్కరూ ఫస్ట్ ఎయిడ్ డాక్టర్లే నన్నారు. 25 వ డివిజన్ కార్పొరేటర్ బద్దెపూడి నరసింహ గిరి ప్రసంగించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర యూత్ ఆఫీసర్ ఏ. మహేందర్ రెడ్డి, హై స్కూల్ హెడ్మాస్టర్ వెంకటరమణ, సెట్నల్ మేనేజర్ శ్రీనివాసరావు, . జన్ని రమణయ్య, అనుముల జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ మాదాల తరుణ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

టిడిపిలో 20కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-లింగసముద్రం

శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో మండలంలోని తిమ్మారెడ్డిపాలెం గ్రామానికి చెందిన 20 బీసీ కుటుంబాలు గురువారం రాత్రి తెలుగుదేశం పార్టీలో చేరారు.ఎమ్మెల్యే కొత్తగా చేరిన కుటుంబాలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ.పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సుముచిత స్థానం కల్పిస్తాం. పాత, కొత్త నాయకులు అందరూ కలసి కందుకూరు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలని ఎమ్మెల్యేతెలియజేశారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం, నీలం బ్రహ్మారెడ్డి, పొలిమేర చిన్న నాగిరెడ్డి, మాల్యాద్రి, ఓబుల్ రెడ్డి, ఆవుల మహేష్, పెద్దిరెడ్డి మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి-నెల్లూరు: పిడిఎస్‌యు ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరు నగరంలోని విఆర్‌సి సెంటర్ నుండి కలెక్టరేట్ వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి పిడియస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. వినోద్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తవుతున్న విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షు లు ఎం.సునీల్, జిల్లా కార్యదర్శి షారుక్, ఆశిర్, ప్రసాద్, మస్తాన్, చరణ్ ,పవన్ తో పాటుగా 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు టీకాలు

ప్రజాశక్తి కోవూరు: కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు కార్యదర్శి ప్రసాదరావు శుక్ర వారం గ్రామంలో ఉన్న వీధి కుక్కలకు ఇంజక్షన్లు వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల ఆదేశాల మేరకు ఈ టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని కుక్కలు పెంచే యాజమానులు కూడా ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.



ఆర్ఒ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-లింగసముద్రం

కూటమి ప్రభుత్వం, అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తోందని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరావు పేర్కొన్నారు. మండలంలోని యర్రారెడ్డిపాలెం గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్ ఓ ప్లాంట్ ను గురువారం రాత్రి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఊరి బాగుకోసం తన సొంత నిధులతో మంచినీటి ఆర్ఒ ప్లాంట్ ను ఏర్పాటు చేసిన దాత ఉప్పుటూరి కృష్ణను ఎమ్మెల్యే ముందుగా అభినందించారు. తాను పుట్టి పెరిగిన గ్రామంలో గ్రామస్తుల కోసం ఆరో ప్లాంటు ను ఏర్పాటు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాష్ట్రాన్ని ఆర్థికంగా చిన్నాభిన్నం చేసి తన సొంత ప్రయోజనాలకు ముఖ్యమంత్రి పదవి వాడుకున్న వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని విమర్శించారు.కానీ తమ ప్రభుత్వంలో ప్రజలకు సుపరిపాలన అందిస్తుందని తెలిపారు.నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చెందిస్తానని చెప్పిన మాట ప్రకారం రామాయపట్నం, బిపిసిఎల్, ఇండోసోల్ భారీ పరిశ్రమల తో పాటు వాటి అనుబంధం పరిశ్రమలను మన నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్నారని వాటి ద్వారా మన నియోజకవర్గంలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు.నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి చొరవతో సోమశిల ఉత్తర కాల ద్వారా రాళ్లపాడు ప్రాజెక్టుకు సోమశిల నుంచి రావలసిన 1.5 టిఎంసి నీరు త్వరలో ప్రాజెక్టు చేరుతాయని రైతులకు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే ని గ్రామస్తులు, మహిళలు పార్టీ నాయకులు, కార్యకర్తలు రథంపై ఊరేగిస్తూ బాణాసంచాలు కాలుస్తూ భారీ గజమాల వేసి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం, పార్టీ నాయకులు ప్రసాద్ నారిబోయిన నారాయణ,అడపా రంగయ్య, బోయిళ్ల కొండప నాయుడు, అడపా నరసయ్య, నీలం బ్రహ్మారెడ్డి, జంపాల శివ, గొర్రెపాటి సాంబయ్య, ముత్తులూరి సుధాకర్,తోపూరి రమేష్ పాల్గొన్నారు.



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి



వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి-నెల్లూరు : వినియోగదారులకు మెరుగైన సేవలను అందించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, పిఎం సూర్యఘర్ సోలార్ పథకం కింద ఎస్‌సి, ఎస్‌టి వినియోగదారులకు ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందని ఎపి దక్షిణ విద్యుత్తు పంపిణీ సంస్థ సిఎండి కె.సంతోషరావు పేర్కొన్నారు. శుక్రవారం మాగుంట లేఅవుట్ లోని హెచ్‌ఎన్‌ఆర్ కల్యాణ మండపంలో నెల్లూరు టౌన్, రూరల్స్, కోవూరు డివిజన్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎం సూర్యఘర్ సోలార్ పథకంలో ఒక కిలోవాట్‌కు రూ. 30,000, రెండు కిలోవాట్లకు రూ. 60,000 సబ్సిడీ ఉంటుందని తెలిపారు. బిసి సోదరులకు అదనంగా రూ. 20,000 సబ్సిడీ అందిస్తారు. ఆర్‌డిఎస్‌ఎస్ పథకం ద్వారా ప్రతి గ్రామానికి త్రీ-ఫేస్ విద్యుత్ అందిస్తామన్నారు. సమావేశంలో డైరెక్టర్ టెక్నికల్ కె. గురవయ్య, జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ వి. విజయన్ , టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్, రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ.సోమశేఖర్ రెడ్డి, కోవూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ , కె.రమేష్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కన్స్ట్రక్షన్ కె. పరంధామయ్య , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్, అసిస్టెంట్ ఇంజినీర్స్ ఓ అండ్ ఎం స్టాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ అధికారి

హ్యాండ్ బోర్ ప్రారంభం


ప్రజాశక్తి-కోవూరు: కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్బాలికోన్నత పాఠశాలలో ఇటీవల ఎంపీపీ టి. పార్వతి, ఎంపీడీఓ శ్రీహరిరెడ్డిల స హకారంతో మండల పరిషత్ నిధుల ద్వారా విద్యార్థుల కోసం హ్యాండ్ 'బోర్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు శుక్రవారం దానిని పాఠశాల ప్రాధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయి ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం హ్యాండ్ బోరును ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 800 మంది బాలికలు చదివే ఈ పాఠశాలకు ఎంపీపీ, ఎంపీడీవో ప్రత్యేకంగా చొరవ తీసుకుని హ్యాండ్ బోర్ ఏర్పాటు చేయడం పట్ల వారికి ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలియజ స్తున్నానన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు ఉన్నారు.



దుకాణంలో పరిశీలిస్తున్న దృశ్యం

ప్లాస్టిక్ అమ్మకందారులకు జరిమానాలు

ప్రజాశక్తి-కందుకూరు: స్థానిక కోవూరు రోడ్డు వెంకటనారాయణ బజార్‌లోని షాపులలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కె అనూష ఆధ్వర్యం లో సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు ప్లాస్టిక్ సింగిల్ యూజ్‌గావాడే హోల్ సేల్ షాప్ లలో, తోపుడు బండ్ల వాళ్ల దగ్గర , హోటల్స్‌లోని 120 మైక్రాన్ కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేయడం తో పాటు, జరిమానాలు విధించారు. ప్లాస్టిక్ కవర్లు వాడటం వల్ల కలిగే నష్టాలు గురించి షాప్ యజమా నులకు వివరించారు.



విత్తనాల అమ్మకాలు నిలుపుదలపై నోటీసు

ప్రజాశక్తి-కందుకూరు: పట్టణంలోని శ్రీ అన్నదాత సీడ్స్ విత్తనాల దుకాణంను మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి 2 లక్షల 24 వేల విలువగల వివిధ రకాల విత్తనాల అమ్మకాల నిలుపుదలచేస్తు నోటీసు జారీ చేశారు. విత్తన లైసెన్స్ పునరుద్ధరి ంచుట, ధరల పట్టికను ప్రదర్శించకపోవడం, రైతులకు కొనుగోలు రశీదులు ఇవ్వకపోవడం లాంటివి గుర్తించి ఆయా లోపాలను సరిచేసు కోవాలని సూచించారు. లేని పక్షంలో లైసెన్స్ ను రద్దు చేస్తామని హెచ్చరించారు.రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన సందర్భంలో తప్పకుండా రసీదులు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా రశీదులు ఇవ్వకపోతే తమ దృష్టికి తీసుకురావాలని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేరళ అర్బన్ కాంక్లేవ్ సమావేశంలో కమిషనర్ నందన్

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్ : కేరళ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా రెండు రోజులపాటు నిర్వహిస్తున్న కేరళ అర్బన్ కాంక్లేవ్ సమావేశంలో నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ శుక్రవారం పాల్గొన్నారు. రాష్ట్ర తొలి సమగ్ర పట్టణ విధానాన్ని రూపొందించడానికి నిర్వహించిన కేరళ అర్బన్ కాంక్లేవ్ 2025 కొచ్చి ప్రాంతంలోని గ్రాండ్ హయత్ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించారు. "ఆకాంక్షించే నగరాలు, అభివృద్ధి చెందు సమాజాలు" అన్న థీమ్ తో నిర్వహించిన ఈ సమావేశాన్ని కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరై విజయన్ ప్రారంభించారు.

వాటర్ ప్లాంట్ ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు రూరల్ పరిధిలోని 25 వ డివిజన్, బుజబుజ నెల్లూరు మిట్ట మీద ఉన్న వాటర్ ప్లాంట్ ను పునరుద్ధరి ంచాలని సిపిఎం 25 డివిజన్ శాఖ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ఇంటింటికి సంతకాలు సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం శాఖ కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ దాదాపు 20వేల మంది ప్రజల దాహార్తిని తీర్చే వాటర్ ప్లాంట్ బుజబుజ నెల్లూరు లో నిరుపయోగంగా ఉందన్నారు. .మరమ్మతులు చేయక దాదాపు నాలుగు కోట్ల విలువ చేసే ప్లాంట్ తుప్పు పట్టిందన్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన స్పందించలేదన్నారు. .నెల్లూరు నగర శివారు ప్రాంతమైన బుజబుజ నెల్లూరులో ఎక్కువ మంది పేద ప్రజలు నివసించే ప్రాంతం. ఎక్కడ మంచినీటి కోసం ఒక్కో కుటుంబం 1000 రూపాయలు పైనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు.ఇక్కడ ఉన్న వాటర్ ప్లాంట్ ను రియల్ ఎస్టేట్ కింద మార్చి, అమ్మాలి అనే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజల దాహార్తిని తీర్చే వాటర్ ప్లాంట్ ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు .లేదంటే పెద్ద ఎత్తున స్థానిక ప్రజలను కలుపుకొని ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో 25 డివిజన్ సీనియర్ నాయకులు సోమవరపు వెంకయ్య. ఏ తిరుపాల్. యు శ్రీనివాసులు. బాలకృష్ణ. ఆదాం. సుమంత్ . గంగాధర్. పెంచలయ్య. ఈశ్వరయ్య. భార్గవ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న స్థానికులు, నాయకులు

మాచవరంలో లార్వా సర్వే

ప్రజాశక్తి-కందుకూరు

మండలంలోని మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల మాచవరం బీసీ, ఎస్‌సి కాలనీ లలో కీటక జనిత వ్యాధులను నియంత్రిచుటకు ఇంటింటా ఫీవర్ లార్వా సర్వే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వై . నీరజ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యంగా కాలాను గుణంగా వచ్చే వ్యాధులైన జలుబు , దగ్గు , జ్వరాలు అక్కడక్కడ వస్తున్నందున నీటి తొట్లు , కుళాయి గుంతలు , రోళ్లు, పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు , నిల్వ ఉన్న నీటి వస్తువులు, ఇంటి ముందు పరిసర ప్రాంతాలలో తొలగించుకోవాలని ఏఎన్ఎంలు ఆశ కార్యకర్తల ద్వారలార్వా సర్వే అవగాహన చేయించారు. మాచవరం వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ రాకేష్ కుమార్ మాట్లాడుతూ వైరల్ ఫ్లూ వ్యాధులైన సాధారణ జలుబు,దగ్గు, జ్వరం తరచూ వస్తున్నాయి. చికిత్స తీసుకుంటే మూడు నుండి ఐదు రోజులలో తగ్గుతున్నాయన్నారు. ముఖ్యంగా కమ్యూనిటీ స్ప్రెడ్ అయినందున అందరూ కాచి చల్లార్చిన నీరు తాగాలని , ఒకే చోట ఎక్కువమంది ఉన్నా కూడ ఒకరి నుండి ఒకరికి ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఉందని వ్యక్తిగతంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్. సి. హెచ్ రామారావు , డీపీఎంఓ కే.వెంకటేశ్వర్లు , హెల్త్ సూపర్‌వైజర్‌లు ఎం. శ్రీనివాసరావు , కే. శ్రీమన్నారాయణ , హెల్త్ అసిస్టెంట్ ఐ. శ్రీధర్ బాబు , ఎమ్. ఎల్ . హెచ్ .పి రమ్య , ఎఎన్ఎం లు మంజుల, గీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




లార్వా సర్వేలో అధికారులు

వివిధ విభాగాల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

:జిల్లా స్థాయిలో జరిగిన కళా ఉస్తావ్- 2025" వివిధ వి భాగాల్లో తోటపల్లిగూడూరు లో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతభను ప్రద ర్శించారు. వివరాల్లోకి వెళితే.,... పల్లిపాడు డైట్ కాలేజీ లో శుక్రవారం జిల్లా స్థాయిలో జరిగిన కళా ఉస్తావ్- 20 25 పోటీలు జరిగాయి. ఈ పోటీలలో తోటపల్లి గూడూ రు జిల్లా పరిషత్ హై స్కూల్ కి చెందిన విద్యార్థులు పా ల్గొన్నారు. జిల్లా స్థాయిలో జరిగిన పో టీలలో అద్భుతంగా రాణించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు రియాజ్ అహ్మద్, డ్రాయింగ్ మాస్టర్ గజేంద్ర, తదితరులు అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొ న్నారు.



ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 10మంది బాధిత కుటుంబాలకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వర రెడ్డి ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల కాలం చెందిన వారి కర్మకాండల నిమిత్తం రూ.1లక్ష నగదు దాతృత్వం చేశారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని కాలం చెందిన వారి కుటుంబాలను ప్రత్యేకంగా వారిని కలిసి పరామర్శించి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున 10 కుటుంబాలకు రూ.లక్ష అందజేశారు. ఆయా కుటుంబాలు తానెప్పుడూ అండగా ఉంటానని వారికి భరోసా కల్పించారు. లబ్ధి పొందిన కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఇలాగ ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎందరో మాలాంటి పేదవారి ఆకలిని తీరుస్తూ బస్టాండ్, నెల్లూరు పాలెం, హాస్పిటల్ ఎదురుగా మంచినీరు మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేసి ఎంతోమంది దాహార్తిని తీరుస్తూ ఇలాగ తమ కుటుంబ సభ్యులు మరణిస్తే రూ.10వేల దాతృత్వం చేసిన పరమేశ్వర్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

సిసిరోడ్డు నిర్మాణం ఆపాలని వినతి



ప్రజాశక్తి-ఎఎస్‌పేట : తహశీల్దార్ కార్యాలయంలో చౌటభీమవరంకు చెందిన పద్మిపాల. లక్ష్మీదేవి తమకు సంబంధించిన స్థలంలో సిసి రోడ్డు నిర్మాణం చేయరాదని ఆర్‌డిఒ, తహశీల్దారుకు అర్జీని సమర్పించారు. అనంతరం ఆమె పత్రిక విలేకరులతో మాట్లాడుతూ తనకు పెళ్లి జరిగి 15 సంవత్సరాలు అయిందని, తమకు ఎక్కడ ఒక సెంటు భూమి లేదని, తనలాగే గ్రామంలో ఎస్‌సి ఎస్‌టి బిసి కులాలకు సంబంధించిన 60 కుటుంబాలు ఉన్నాయన్నారు. ఇటీవల తనకు సంబంధించిన స్థలంలో రోడ్డు వేయడానికి గ్రామ సర్పంచ్ లక్ష్మీ నరసయ్య ప్రయత్నించగా అడ్డు తగిలానని అందుకు ఆయన ఆ స్థలం గవర్నమెంట్ ల్యాండ్ అని చెప్తూ ఉన్నారని, తమ సర్పంచ్‌కి సర్వేనెంబర్ 343లో రెండవ భిన్నంలో నాలుగు ఎకరాల 68 సెంట్ల భూమి కలదని, అదేవిధంగా అదే సర్వే నెంబర్లు మూడో భిన్నంలో నాలుగు ఎకరాల 94 సెంట్లు మాదాల పద్మ పేరుతో అనగా వారి భార్య పేరుతో ఆన్‌లైన్ భూమి కలిగి ఉన్నారని తెలిపారు. దానికి సంబంధించిన వన్‌బి, అడంగల్‌ను జతపరుస్తున్నామని తెలిపారు. కావున ఆ రెండు వన్ బి, అడంగల్‌ను పరిశీలించి వాటిని ప్రభుత్వం వారు స్వాధీన పరచుకొని తమలాంటి నిరుపేదలకు పంచాలని, స్థానిక తహశీల్దార్ కోరామని, ఆర్‌డిఒకు కూడా ఇదే విషయాన్ని తెలియపరిచామని, అర్జీలు సైతం ఇచ్చామన్నారు.

ఇంకుడు గుంతల నాణ్యతపై దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి-బిట్రగుంట



తెలుగుదేశం ప్రభుత్వంలో బోగోలు మండలంలో కట్టిన ఇంకుడు గుంతల అవినీతిపై దర్యాప్తు చేయాలని బోగోలు మండల వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బోగోలు గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల యందు ప్రభుత్వ నిధులతో కట్టిన ఇంకుడు గుంత ఎంత నాణ్యతగా కట్టారో ఒకసారి చూడాలన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణానికి టిడిపి ప్రభుత్వం నిధులు రూ.16వేలు చొప్పున కేటాయించిందని, వీటి నిర్మాణం ఎలా ఉందో ప్రజలు ఆలోచించాలన్నారు.

మహిళా అధ్యక్షురాలిగా రజియా



ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండల కేంద్రమైన ఎఎస్‌పేటలో దళిత గిరిజన మైనారిటీ సంఘాల జెఎసి ఆధ్వర్యంలో మండల మహిళా అధ్యక్షురాలుగా షేక్ రజియా బేగం ఏకగ్రీవంగా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మాధవి ప్రతిపాదించారని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్‌సి ఎస్‌టి మైనారిటీ బిసి కులాల బలోపేతం చేసే ఉద్దేశంతో కలిసికట్టుగా పనిచేయాలని రజియాను మండల అధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. రానున్న ఎంపిటిసి సర్పంచ్ తదితర ఎన్నికలలో బీసీలకు మైనారిటీలకు ఎక్కడ అన్యాయం జరిగినా, మన ఓటు హక్కును ఇంట గెలిచి రచ్చ గెలిచే చందంగా పనిచేయాలని, పవిత్ర పుణ్యక్షేత్రమైన ఎఎస్‌పేటలో మైనారిటీ సోదరీమణి అయిన రజియాను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన మండల మహిళా అధ్యక్షురాలు మాట్లాడుతూ మహిళలకు ఎక్కడ ఏ సమస్య వచ్చినా తమకు తెలిసిన సమక్షంలో ఖచ్చితంగా వారి పట్ల అంకితభావంతో నిలబడి వారి సమస్యలను ప్రభుత్వానికి నివేదించి ఆ సమస్య పరిష్కారమయ్యే దిశగా తమ వంతు కృషి చేస్తానని వాగ్దానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దావీదు, రాష్ట్ర దళిత నాయకులు తుమ్మ మస్తాన్, ఆత్మకూరు మండల అధ్యక్షులు సంధాని, తదితరులు పాల్గొన్నారు.

యూరియా వినియోగంపై అవగాహన



ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని భీమవరం గ్రామ సచివాలయంలో పంటలకు యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారి వెంకటేష్, పాల్గొని మాట్లాడుతూ యూరియా ఎక్కువ మోతాదులో వాడడం ద్వారా నత్రజని శాతం అధికమవడం వల్ల చౌడుభూమిగా మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, క్రమంగా నేల మొద్దు బారడంతోపాటు పంటల దిగుబడి కూడా తగ్గుతుందని, దానివల్ల రైతులు ఎక్కువ శాతం నష్టపోయే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌ఛార్జి బాలకిషోర్, విఎఎ వెంకటేశ్వర్లు, ఖాదర్పూర్ ఐసిఆర్‌పి నవ్య, రైతులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ఉదయగిరి : మండల రైతులు వ్యవసాయ పంట పొలాల్లో యూరియాను వాడడంతో అధిక ఖర్చులతో కూడిన పురుగు మందులు పెరుగుతాయని మండల వ్యవసాయ అధికారి విజయభాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మండల పరిధిలోని కృష్ణంపల్లి గ్రామంలో యూరియా అధిక మొత్తాదులో వాడటం వల్ల కలుగు నష్టాలను పంచాయతీ రైతులకు వివరించారు. ముఖ్యంగా భూములు గుణాలు మా రాటమే కాకుండా భూమిలో ఉన్న పంటకు ఉపయోగపడే సుక్ష్మ జీవులు నాసిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్, కళ్యాణ్ పాల్గొన్నారు.

దామిశెట్టి కుటుంబానికి పరామర్శ



ప్రజాశక్తి-కావలి : కావలిలో డి బి ఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో వైసిపి స్టేట్ నెల్లూరు జిల్లా స్టేట్ ఇంటలెక్చువల్ ఫోరం జనరల్ సెక్రెటరీ దామిశెట్టి సుధీర్ నాయుడు తండ్రి దామిశెట్టి శ్రీనివాస నాయుడు ఇటీవల పరమపదించడంతో డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో వారి కుటుంబ సభ్యుల్ని సంతనూతల పాడు మాజీ శాసనసభ్యుడు టీజెఆర్ సుధాకర్ బాబు పరామర్శించారు. ఈ సందర్భంగా టీజేఆర్ సుధాకర్ బాబు మాట్లాడుతూ దామిశెట్టి శ్రీనివాస నాయుడుతో దామిశెట్టి శ్రీనివాస నాయుడు డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల స్థాపించి. విద్యా రంగానికి ఎన్నో సేవలు చేశారన్నారు. అలానే రాజకీయంగా అనేక ఉన్నతపదవులుఅధిరోహించి ఆ పదవులకే గౌరవాన్ని తెచ్చిన వ్యక్తి అని, సుధీర్ కు వారి కుటంబసభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుదీర్ నాయుడు, డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ దామిశెట్టి మల్లికార్జున రావు, కళాశాలప్రిన్సిపాల్, డాక్టర్ టీవీ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



ప్రజాశక్తి-కావలి : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు పొందిన కావలి పట్టణ వాస్తవ్యులు ఉపాధ్యాయ సంఘం నాయకులు బి.మధుసూదన్ రావు మరియు ఎం.రమణ కుమార్‌లకు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లాస్థాయి విద్య అధికారులు నెల్లూరు నగరంలో ఘన సన్మానం చేసిన శుభసందర్భంగా, కావలి పట్టణం కనుమల్లవారి వీధిలో నున్న "సాగర్ లా అసోసియేట్స్" కార్యాలయంలో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలు బి.మధుసూదన్ రావుకి మరియు ఎం. రమణ కుమార్‌కు మిత్రులు శ్రేయాభిలాషులు మధ్య చిరు సత్కారం. ఈ సన్మాన కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువు, సీనియర్ జర్నలిస్ట్ సిద్ధి జయప్రతాప్ రెడ్డి, ఉపాధ్యాయులు కామేశ్వరరావు, పసుపులేటి రమేష్, బ్యాంక్ ఎంప్లాయ్ సింగంశెట్టి పూర్ణ కుమార్, టైలర్ చాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళులు



ఏచూరి వర్ధంతి సభలో మాట్లాడుతున్న మోహన్‌రావు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

దేశ రాజకీయ రంగంలో సీతారాం ఏచూరి లేని లోటు పూడ్చలేనిదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్ రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని (జెట్టి రమణారెడ్డి భవన్) సిపిఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యవర్గం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వక్త సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.మోహన్ రావు మాట్లాడుతూ భారతదేశ రాజకీయ రంగంలో సిపిఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమరజీవి సీతారాం ఏచూరి లేని లోటు పూడ్చలేనిదని ప్రపంచ కమ్యూనిస్టు దిగ్గజాలలో సీతారాం ఏచూరి ఒకరిని ఆయన అన్నారు. బిజెపి రాజ్యాంగంపై దాడి చేస్తున్న ప్రతి సందర్భంలోనూ దేశవ్యాప్తంగా సీతారాం ఏచూరి బలమైన పోరాటాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి కొప్పోలు డేవిడ్ రాజు, సిపిఎం నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సంధాని, ఎం.నాగేంద్ర, బద్వా నాయకులు గుల్జార్ బేగం, సిఐటియు మండల కార్యదర్శి కొండమూరి హజరత్తయ్య, సిపిఎం నాయకులు ఆశ్ర హజరత్తయ్య, మహబూబ్ బాషా, మల్లికార్జున, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండల కేంద్రంలో ఉండే అతిథి గృహం వద్ద సిపిఎం జాతీయ కార్యదర్శిగా పని చేసిన సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వర్ధంతి సభకు గాడి సుధాకర్ అధ్యక్షత వహించారు. అనంతరం సీతారాం ఏచూరి చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మంగళ పుల్లయ్య, మండల కార్యదర్శి అన్వర్ బాషా, మండల కమిటీ సభ్యులు డాక్టర్ సుబ్బారాయుడు, తదితరులు పూలమాల వేశారు. పార్టీ సభ్యులు అందరూ పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంగళ పుల్లయ్య మాట్లాడుతూ సీతారాం ఏచూరి నిర్యాణమై అప్పుడే సంవత్సరం అయ్యిందని, దేశ రాజకీయ రంగంలో ఆయనలేని వెలితి స్పష్టంగా కనిపిస్తుందన్నారు. భారత రాజ్యాంగ మౌలిక విలువలైన ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజం, సామాజిక న్యాయం, సమానత్వం, సోషలిజంలపై బిజెపి కేంద్ర సర్కారు తీవ్రమైన దాడి చేస్తున్న తరుణంలో దాన్ని ఎదిరించి పోరాడే శక్తులను ఐక్యపర్చి ముందుకు తీసుకుపోవడంలో సీతారాం ఏచూరి కృషి అసమానమైందన్నారు. ఇప్పుడు ఆయన లేకపోయినా ఆ ఒరవడిని మరింత పటిష్టంగా ముందుకు



అనంతసాగరంలో...

తీసుకుపోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నాయి. భారతీయత భావనకు పునాది మన సమ్మిళిత సాంస్కృతిక వారసత్వంలో ఉందని సీతారాం ప్రగాఢంగా నమ్మారని తెలిపారు. ఆయన రచనల్లో ఉపన్యాసాల్లో ఈ అంశాన్ని తప్పకుండా ప్రస్తావించేవారన్నారు. ఈ సమ్మిళిత సాంస్కృతిక వారసత్వాన్ని నేడు మతోన్మాద శక్తులు ధ్వంసం చేస్తున్నాయన్నారు. బిజెపి అధికారాన్ని, రాజ్య వ్యవస్థలను ఉపయోగించుకుని మరింత వినాశకరమైన దాడులు చేస్తున్నారన్నారు. దాన్ని ఎదిరించి మన దేశ పురోభివృద్ధి, అంతిమంగా సోషలిస్టు సమాజ సాధనకు అవసరమని తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు డాక్టర్ సుబ్బారాయుడు, వేము పెంచలయ్య, గాడి సుధాకర్, జక్రయ్య, ఉప్పలపాడు మస్తాన్, సత్తార్, మహిళా శాఖ సభ్యులు విజయలక్ష్మి, లోకేశ్వరి, మండలంలో అన్ని శాఖల కార్యదర్శులు పార్టీ సభ్యులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు

డిపో ఎదుట ఎస్‌డబ్ల్యుఎఫ్ నిరసన

ప్రజాశక్తి-ఉదయగిరి

ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక డిపో గేటు వద్ద ఆర్‌టిసి కార్మికులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఆర్‌టిసిలో రక్షణ కోసం ప్రతి ఏడాది సెప్టెంబర్ 12న ఆర్‌టిసిల రక్షణ దినోత్సవంలో భాగంగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ముఖ్య డిమాండ్లుగా ఆర్‌టిసిలో విద్యుత్ బస్సులు కొనేందుకు, నిర్వహించేందుకు నడిపించేందుకు అవకాశం కల్పించి నిధులు ఇవ్వాలన్నారు. విద్యుత్ బస్సుల విధానంలో మార్పు చేసి జి.సి.సి రద్దు చేయాలన్నారు. ఖర్చుకు ఆదాయానికి మధ్య వ్యత్యాసాన్ని ఆర్‌టిసికి చెల్లించాలన్నారు. బస్టాండ్ల ప్రయివేటీకరణ నిలిపి మహిళలకు ఉచిత బస్సులకు అయ్యే మొత్తం ఖర్చును ప్రభుత్వం ఆర్‌టిసికి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎస్.రవి, కోశాధికారి వి.రవిబాబు, డిపో ఉపాధ్యక్షులు ఎన్.సుధాకర్ రెడ్డి, ఎడిసిలు కె.వెంకటేశ్వర్లు, డి.వెంకటేశ్వర్లు, కండక్టర్ పి.చిట్టిబాబు, టైర్ మెకానిక్ టి.తిరుపతయ్య, స్టోర్ అసిస్టెంట్ కె.మల్లిఖార్జున పాల్గొన్నారు.

నేడు సిఐటియు మండల మహాసభ

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండల కేంద్రమైన వరికుంటపాడులో శనివారం సిఐటియు మండల మహాసభ జరగనున్నట్లు సిఐటియు మండల అధ్యక్షులు ఏనుగు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి మట్టే హరి నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్ కుమార్ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిఒక్క సిఐటియు కార్యకర్తలు నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని వారు తెలిపారు.



కుర్చీని ప్రారంభిస్తున్న దృశ్యం

ఆర్‌టిసి బస్టాండ్‌కు కుర్చీలు వితరణ

ప్రజాశక్తి-వింజమూరు

మండల కేంద్రంలోని ఎపిఎస్ ఆర్‌టిసి బస్టాండ్‌కు రీజనల్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్ రెడ్డి వినతి మేరకు వింజమూరుకు చెందిన ధరణి సేవా సమితి ఆధ్వర్యంలో యల్లాల చిన్న వెంకటరెడ్డి - పుల్లమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు దాదాపు రూ.25వేల విలువైన 9 సీటర్ కుర్చీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎపిఎస్ ఆర్‌టిసి ఉదయగిరి డిపో ఇన్‌ఛార్జ్ మేనేజర్ శివకేశవ యాదవ్ మాట్లాడుతూ వింజమూరులోని ఆర్‌టిసి బస్టాండ్‌కు ప్రయాణికుల ఆదరణ ఎక్కువగా ఉందని రీజనల్ చైర్మన్ సూచనలు, సలహాలు మేరకు ఈ మధ్యనే ఫ్యాన్లు కూడా బిగించినట్లు తెలిపారు. అదేవిధంగా గతంలో ఆర్‌టిసి బస్టాండ్‌కు రహదారితో కలిపి దాదాపు రెండు ఎకరాల స్థలాన్ని విరాళంగా అందజేసిన యల్లాల కుటుంబీకులే నేడు ప్రయాణికుల సౌకర్యార్థం కుర్చీలను వితరణ చేయడం అభినందించదగ్గ విషయమని తెలిపారు. ఆర్‌టిసి తరపున వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. ధరణి సేవా సమితి ప్రతినిధి యల్లాల రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 14, వింజమూరు ఎపిఎస్ ఆర్‌టిసి బస్టాండ్‌ను పరిశీలించిన రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి ప్రయాణికుల సౌకర్యార్థం విలువైన సూచనలు, సలహాలు అందజేశారని ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించడంలో భాగంగా నేడు కుర్చీలను వితరణ చేస్తున్నామన్నారు. ఆర్‌టిసి అసిస్టెంట్ ఇంజనీర్ సుభాషణం, ఉదయగిరి ఎటిసి నాగభూషణం, యల్లాల రమణారెడ్డి, తిప్పిరెడ్డి రమేష్, రేవునూరు చిన్నబయ్య, బయపరెడ్డి, శివకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు : డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి రైతులు 997పొగాకు బేళ్లను వేలానికి తీసుకురాగా వీటిలో 640బేళ్లను పలు కంపెనీ ప్రతినిధులు కొనుగోలు చేశారనివేలం నిర్వహణా ధికారి రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 337బేళ్లను తిరస్కరించారన్నారు. వాటిలో ఎన్ఎస్ 73ఎన్ బి243, ఆర్‌ఆర్ 07సి ఆర్ 14ఉన్నాయని తెలిపారు. అధిక బరువుతో ఉన్న 20బేళ్లను వేలానికి అనుమతించలేదన్నారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.330కాగా, కనిష్ఠ ధర రూ.100లు. సగటు ధర రూ.208.35 అని, 9మంది ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలియజేశారు.

కూటమితోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జగదేవిపేట గ్రామంలో సిసిరోడ్ల ప్రారంభోత్సవం, డ్రెయిన్ల శంకుస్థాపన కార్యక్రమంలో ఎంఎల్ఎ ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్ఎ వెంట నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి సిసి రోడ్లలో ప్రారంభించారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరగని అభివృద్ధి టిడిపి ప్రభుత్వ పాలనలో జరుగుతుందన్నారు. గడిచిన ఒకటిన్నర సంవత్సర కాలంలో ప్రతి గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించడం జరిగిందన్నారు. అనుభవజ్ఞులైన నారా చంద్రబాబు నాయుడు ఎన్నో ప్రణాళికలు రచిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నారన్నారు. నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు వారిని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకొని 24గంటల లోపల తెలుగు రాష్ట్రాలకు తీసుకురావడం ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్ పల్లె పండుగ



మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామానికి గుంటలు లేని రోడ్లను అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, టిడిపి ప్రధాన కార్యదర్శి రావెళ్ల వీరేంద్ర చౌదరి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ దేవిరెడ్డి రవీందర్ రెడ్డి, జెడ్‌పిటిసి వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు ఏకోళ్ళు పవన్‌రెడ్డి, కదురు రాధాకృష్ణారెడ్డి, కదురు చంద్రారెడ్డి, కూకటి వెంకటేశ్వర్ల రెడ్డి, బొల్లినేని మల్లికార్జున నాయుడు, జనసేన నాయకులు గుడి హరికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంధమహోత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఖాజా నాయబ్ రసూల్, దొరసానమ్మ 252 గంధ మహోత్సవాన్ని పురస్కరించుకొని, ఎఎస్‌పేటకు ఆత్మకూరు ఆర్‌డిఒ బి.పావని, తహశీల్దారు అనిల్ కుమార్, మండల అధికారులతో కలిసి ఎఎస్‌పేట ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేయబోయే పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో, దర్గా ఇఒ షేక్.మహమ్మద్ హుస్సేన్‌లతో కలిసి, ఆత్మకూరు ఎపిఎస్‌ఆర్‌టిసి డిఎంతో బస్సు ఏర్పాట్ల గురించి చర్చించారు. పారిశుధ్యంపై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి షరీఫ్‌తో మాట్లాడుతూ ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసుకొని ఎఎస్‌పేటకు వచ్చే భక్తులకు తాగునీరు, షామియానాలు ఏర్పాటు, తదితర విషయాలపై చర్చించారు. అనంతరం విద్యుత్ అధికారులతో



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్‌డిఒ పావని

ఆర్‌డిఒ మాట్లాడుతూ విద్యుత్ అంతరాయం లేకుండా మూడు రోజులు పాటు సక్రమంగా విద్యుత్ అందించే బాధ్యత తీసుకోవా లని తెలిపారు. అనంతరం సిఐ వేమారెడ్డి మాట్లాడుతూ ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన లు జరగకుండా చూడడానికి, సిసి కెమెరాలు, ఏర్పాటు చేయాలని పంచాయతీ వారిని కోరారు. అనంతరం ఆర్‌డిఒ ఆరోగ్యశాఖ అధికారులతో మాట్లాడుతూ పార్కింగ్ ప్రదేశాలలో ఏర్పాటు చేసే ప్రాంతాలలో, దర్గా పరిసరాల్లో ప్రత్యేక హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని అవి మూడు రోజులపాటు నిరంతరం కొనసాగించాలని తెలిపారు. అదేవిధంగా ఫైర్ ఇంజన్, 108 అందుబాటులో ఉంచాలని అవినీతి ప్రదేశాల్లో వచ్చే భక్తులకు అందు బాటులో ఉండే విధంగా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారుల దేనని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ అబ్బురి రమేష్ నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

బస్సు చోరీ నిందితుడు పట్టివేత

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : తమిళనాడులోని కోయంబేడు బస్టాండ్‌లో ఉన్న బస్సుని ఒరిస్సాకు చెందిన నిరంజన్ సాహు అనే దొంగ బస్సును దొంగిలించగా, ఆ విషయం తెలుసుకున్న డ్రైవర్, కండక్టర్లు జిపిఎస్ ద్వారా బస్సు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు సమీపంలో ఉందని తెలుసుకొని, ఆత్మకూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఆ విషయం తెలుసుకున్న సిఐ గంగాధర్, ఎస్ఐ జిలానిభాషా చాకచక్యంగా బస్సును చేధించి దొంగను పట్టుకున్నారు. దొంగను మందలించి, బస్సును, నిండుతుడిని తమిళనాడు పోలీసులకు అప్పగించగా, తమిళనాడు పోలీసులు సిఐ గంగాధర్, ఎస్ఐ , ఎస్ఐ, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.



రూ.10వేలు ఆర్థికసాయం

ప్రజాశక్తి-సీతారాంపురం

కంటి సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా చూపుకోల్పోయి వైద్య చికిత్సలు చేయించుకుంటున్న సీతారామపురంలోని సినిమా హాల్ వీధికి చెందిన ఎడమకంటి సుబ్రహ్మణ్యం అనే నిరుపేదకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేలను నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ మెంబర్, ఉదయగిరి నియోజకవర్గ జనసేన నాయకుడు భోగినేని కాశీరావు అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఎడమ కట్టి సుబ్రమణ్యం పరామర్శించి, ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోగినేని కాశీరావు మాట్లాడుతూ ఉదయగిరి ఎంఎల్ఎ కాకర్ల సురేష్ సహకారంతో సిఎంరిలీఫ్ ఫండ్ ద్వారా బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల మాజీ కన్వీనర్ ముత్తంశెట్టి చెన్నకేశవులు, మండల జనసేన నాయకుడు భోగినేని కాశీరత్తయ్య (గాంధీ), ఊర చెరువు నీటి సంఘం అధ్యక్షుడు నీలి రత్తయ్య, జెడ్‌పి హైస్కూల్ కమిటీ చైర్మన్ తోట ఏడుకొండలు, సొసైటీ డైరెక్టర్ గొల్లపల్లి భాస్కర్, జన సైనికులు చెన్నకేశవులు, జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నేదురుమల్లి రమేష్, వెంకట్, మురళి తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరమ్మ నేత్రదానం



ప్రజాశక్తి-కావలి

కావలి మండలం గౌరవరం గ్రామంకు చెందిన ముమ్మడిసింగు మల్లేశ్వరమ్మ (72) శుక్రవారం మధ్యాహ్నం వారి స్వగృహంలో మరణించారు. ఆ గ్రామంలోని సామాజిక కార్యకర్త దిరశం శివశంకర్ రెడ్డి, వారి కుటుంబసభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించి, కావలి రెడ్‌క్రాస్‌కు సమాచారం ఇచ్చారు. జిల్లా రెడ్‌క్రాస్ పాలక మండలి సభ్యుడు కలికి శ్రీహరి రెడ్డి నేత్రదానానికి ఏర్పాట్లు చేశారు. కుమార్తె సన్నమూరి విజయలక్ష్మి అంగీకారంతో మల్లేశ్వరమ్మ కార్నియాలను నెల్లూరు ఎల్వి ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ సునీల్ సేకరించారు. కుటుంబసభ్యులకు నేత్రదాన ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఇది కావలి రెడ్‌క్రాస్ ద్వారా జరిగిన 148వ నేత్రదాన మని చైర్మన్ డి.రవిప్రకాష్ తెలిపారు. కావలి రెడ్‌క్రాస్ నేత్రదాన విభాగం కన్వీనర్ ఇలింద్రశ్రీవాణి మాట్లాడుతూ కండ్లను కాటికి పంపకుండా, కబోధులకు ఇవ్వాలని, ఒకరి నేత్రదానం వల్ల ఇద్దరు కార్నియా అంధులకు చూపు వస్తుందని ఆమె వివరించారు. నేత్రదాత మల్లేశ్వరమ్మ కుటుంబసభ్యులకు అభినందనలు తెలిపారు.

లేఅవుట్లను రెగ్యులైజేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు నియోజకవర్గ పరిధిలో నుడా నిబంధనలు పాటించని అనధికార లే అవుట్ల యజమానులు 2025 అక్టోబర్ 30వ తేదీ లోపు అపరాధ రుసుం చెల్లించి రెగ్యులైజేషన్ చేసుకోవాలని ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలియజేశారు. నెల్లూరు అర్బన్ డెవలెప్మెంట్ అథారిటీ (నుడా) అధికారులతో కలిసి కోవూరు గ్రామంలోని పివిఆర్ కల్యాణం మండపంలో శుక్రవారం నిర్వహించారు. లే అవుట్ రెగ్యులైజేషన్ స్కీమ్ అవగాహన సదస్సులో ఎంఎల్ఎ ప్రశాంతి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ అనధికారిక లే అవుట్ల వల్ల ప్రభుత్వ ఖజానాకు గండి పడడమే కాకుండా ప్లాట్లు కొన్నవాళ్ళు కూడా నష్ట పోతున్నారన్నారు. గత ప్రభుత్వంలో కొందరు రియల్టర్లు అనధికారికంగా వేసిన లేఅవుట్లలో ప్రజా పయోజనం వదలాల్సిన 10శాతం స్థలం వదల లేదని వారికి అవగాహన కల్పించి 7శాతం అపరాధ రుసుం కట్టించడంలో అధికారులు చొరవచూపాలని కోరారు. అక్రమ లేఅవుట్లను అరికట్టే విషయంలో ఆదిలోనే అధికారులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. అనధికారిక లే అవుట్లలో 90 శాతానికి పైగా గత ప్రభుత్వ



మాట్లాడుతున్న ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి

హయాంలో వేసినవేనన్నారు. లే అవుట్ రెగ్యులైజేషన్ స్కీమ్ ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించడంతో పాటు అక్రమ లేఅవుట్లతో ఎదురయ్యే ఇబ్బందులపై అధికారులు చైతన్యపరచాలని ఆమె తెలిపారు.కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, జాయింట్ కలెక్టర్ కార్తీక్, జెడ్‌పి వైస్ చైర్మన్ శ్రీహరికోట విజయలక్ష్మి, పెన్నాడెల్టా ఛైర్మెన్ జెట్టి రాజగోపాలరెడ్డి, బుచ్చిరెడ్డి పాళెం మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి, జొన్నవాడ ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి, ఎంపిపి పార్వతి, నుడా అధికారులు అల్లంపాటి పెంచలరెడ్డి, హిమబింధు పాల్గొన్నారు.

మంచినీటి పైప్‌లైన్ ప్రారంభం

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని ప్రశాంతి థియేటర్ ఎదురు బజార్ లో నూతనంగా ఏర్పాటు చేసిన పైపులైను, ఇంటింటికి మంచినీటి కుళాయిలను శుక్రవారం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరావు, అధికారులు,పార్టీ నాయకులు మహిళలతో కలసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు ఆ ప్రాంతం మహిళలు తమకు మంచినీటి పైపులైను లేదని మంచినీటి కోసం చాలా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేయాలని కోరారు.



కొళాయిని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి

ప్రాంత మహిళల కోరిక మేరకు నేడు మంచినీటి పైప్ లైన్ ఏర్పాటు చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా మంచినీరు అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ సందర్భంగా ఆ ప్రాంత మహిళలు మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాల నుంచి మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు. మా కష్టం తెలుసుకొని మాకోసం మంచినీటి పైపు లైన్ ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలియజేశారు. ముందుగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఇంటూరికి ఆ ప్రాంత మహిళలు, పార్టీ నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికి గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె అనూష, పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు ఆల్ బాషా, పార్టీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఇతర ముఖ్య నాయకులు మహిళలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం తనిఖీ

ప్రజాశక్తి- సీతారాంపురం



విద్యార్థుల కు అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం తీరును శుక్రవారం ఎంఇఒ ఎస్.కె మస్తాన్ వలీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట నిర్వాహకులు మెనూ ప్రకారం విద్యార్థులకు మెరుగైన భోజనం అందించాలని తెలిపారు. సీతారామపురంలోని ఆదర్శ పాఠశాలను ఎంఈఓ మస్తాన్వలి ఆకస్మిక తనిఖీ చేసి భోజనాన్ని రుచి చూసి సంతృప్తి ప్రయత్నం చేశారు. వంట నాణ్యతను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రతి తరగతి గదిని పరిశీలించి ఐఎఫ్‌పి ప్యానల్ ద్వారా విద్యాబోధన తీరును పరిశీలించారు. అంతే కాకుండా ఆరవ తరగతి విద్యార్థుల క్లాస్ నోట్ బుక్ ను పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన అందించి వారిలోని ప్రతిభను వెలికి తీయాలని కోరారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సమీరారెడ్డి, సిఆర్‌పి కులారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.